క్లుప్తంగా

సమాజంలో గురువు స్థానం చాలా గొప్పది



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట: పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది గురువు మాత్రమేనని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. బుధవారం జగద్గిరినగర్ ఉన్నత పాఠశాలలో కార్పొరేటర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... సమాజంలో గురువు స్థానం చాలా గొప్పదని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సుధాకర్, నాయకులు మల్లేష్‌గౌడ్, పాపులు గౌడ్, బాబుగౌడ్, దాసు, ఇంద్ర, శాంతి, యాదగిరి, దుర్గేష్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

గురువులను ఎప్పటికీ మర్చిపోవద్దు



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న కేపీ విశాల్‌గౌడ్

కుత్బుల్లాపూర్: చదువు చెప్పిన గురువులను ఎప్పటికీ మర్చిపోవద్దని యువనేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేపీ విశాల్‌గౌడ్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశాల్ ముఖ్యఅతిథిగా హాజరై ఉపాధ్యాయులను శాలువలతో సత్కరించి మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఖాజా పాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కేకేఎం ట్రస్ట్ అండగా ఉంటుంది

ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్

చింతల్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను కేకేఎం చారిటబుల్ ట్రస్ట్ అన్ని విధాలుగా అండగా ఉంటుందని బీజేపీ నేత, ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం చింతల్ డివిజన్ నెహ్రూనగర్ జడ్పీహెచ్ఎస్ స్కూల్ విద్యార్థులకు ట్రస్ట్ తరఫున ఆయన గొడుగు, నోట్ పుస్తకాలు, గడియారంతో కూడిన కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు మెరుగు పరచడానికి కృషి చేస్తున్నామన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కిట్లను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బిల్లా వెంకటేష్, ప్రతాప్ రెడ్డి, పాల కుమార్, ఓరుగంటి అఖిల్ సాయి, సాయిరాం రెడ్డి, రాము, నరేందర్ సింగ్, నర్సింహ, ట్రస్ట్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో స్పందించారు.. ప్రాణాలు కాపాడారు



జ్యోతికి ప్రథమ చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

దుండిగల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ యాచకురాలిని అంబులెన్స్ సిబ్బంది సకాలంలో స్పందించి ప్రాణాలను కాపాడారు. డి.పోచంపల్లి సర్వే నం.120 ప్రాంతానికి చెందిన జ్యోతి(42) గండిమైసమ్మ చౌరస్తాలో భిక్షాటన చేస్తుంది. కాగా బుధవారం సాయంత్రం చౌరస్తాలో నిల్చుని ఉంటే ఓ జేసీబీ వాహనం ఆమెను ఢీకొట్టింది. ఈ ఘటనలో కాలు సగ భాగం తెగి తీవ్ర రక్తస్రావం అయ్యింది. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. అనంతరం ఆమెను గాంధీ ఆస్పత్రికి తరలించారు. సకాలంలో స్పందించిన దుండిగల్ అంబులెన్స్ ఈఎంటీ నవీన్, పైలెట్ భీంరావులను స్థానికులు అభినందించారు.

ఈ-కేవైసీ లేకుంటే.. రేషన్ కట్..



- వేలి ముద్రతో నమోదు తప్పని సరి
- రేషన్ కార్డుల్లో అనర్హుల ఏరివేతపై చర్యలు
- జిల్లాలో మొత్తం 5.24 లక్షల రేషన్ కార్డులు
- సభ్యుల సంఖ్య(యూనిట్లు) 17,20,035

సాక్షి, మేడ్చల్ జిల్లా: మీ కుటుంబానికి రేషన్ కార్డు ఉందా.. ఉంటే అందులో పేర్లు ఉన్న వారందరూ ఒకసారి రేషన్(షాపు) దుకాణానికి వచ్చి వేలిముద్ర వేసి, కేవైసీ(నో యువర్ కస్టమర్) నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఏ కారణంతోనైనా రాలేకపోయినా, కుటుంబ సభ్యులు చనిపోయినా ఆ మేరకు మీ కార్డులో బియ్యం కోటా తగ్గిపోతోంది. రేషన్ బియ్యం తప్పుదారి పట్టకుండా నివారించడానికి, అర్హులకే రేషన్ బియ్యం అందించడానికి ప్రభుత్వం ఈ చర్యలకు శ్రీకారం చుట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా రాయితీలను భరించి పేదలకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నాయి. ఆహార భద్రత(రేషన్) కార్డులో పేర్కొన్న సభ్యులు ఒక్కొక్కరికి ప్రస్తుతం ఆరు కిలోల చొప్పున బియ్యం అందజేస్తున్నాయి. కార్డులో పేరున్న ఏ ఒక్క వ్యక్తి చౌక ధరల(రేషన్ షాపు) దుకాణానికి వెళ్లినా సదరు కార్డులో పేర్కొన్న యూనిట్ల ప్రకారం రేషన్ బియ్యం అందిస్తున్నారు.

- రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి రేషన్ కార్డుల్లో నమోదైన సభ్యుల పేరిటే బియ్యం పంపిణీ చేస్తున్నారు. కొన్ని కార్డుల్లోని కుటుంబ యజమాని లేదా సభ్యులు చనిపోయారు. కూతుళ్లు వివాహాలు చేసుకుని అత్తారింటికి వెళ్లిపోయారు. కుమారులు పెళ్లి చేసుకుని ఉద్యోగం, ఉపాధి పేరిట ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. అయినా కార్డుల్లో పేర్లు అలాగే కొనసాగుతున్నాయి. నిరుపేదల ఆకలి తీర్చేందుకు అందిస్తున్న ప్రజాపంపిణీ బియ్యం.. దుర్వినియోగం కాకుండా చర్యలు చేపట్టాలని పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ప్రతి రేషన్ కార్డులోని సభ్యులందరి పేర్లు ధ్రువీకరించుకునేందుకు వారి వేలిముద్రలు సేకరించి కేవైసీ పునరుద్ధరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రేషన్ కార్డులో పేర్లు ఉన్న ప్రతి ఒక్కరూ తమ పరిధిలోని చౌకధరల దుకాణానికి వెళ్లి ఈ-పాస్ మిషన్‌లో వేలిముద్రలు వేసి, కేవైసీ నమోదు చేసుకోవాలని ఆదేశించారు. కేవైసీ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమైంది. కేవలం రేషన్ దుకాణాల్లో మాత్రమే వేలిముద్రలు సేకరించాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డీలర్లు సైతం తమ దుకాణాల పరిధిలోని కార్డుదారులకు సమాచారం అందించి ఒకేసారి కుటుంబ సభ్యులంతా వచ్చి వేలిముద్రలు వేసుకుని తమ కేవైసీ పునరుద్ధరించుకునేలా చూడాలని కోరారు.

ఈ-కేవైసీ నమోదు ఇలా..

- రేషన్ కార్డు ఉన్న కుటుంబ యజమానితోపాటు కార్డులో పేర్లు ఉన్న కుటుంబ సభ్యులంతా సమీప చౌకధరల దుకాణానికి వెళ్లి ఈ-పాస్ మిషన్‌లో వేలిముద్రలు వేయాలి. వేలి ముద్ర వేయగానే రేషన్ కార్డు నంబర్‌తో పాటు సభ్యుల ఆధార్ కార్డు నంబరు చూపిస్తోంది. వీటిని సరి చూసిన తర్వాత ఆకుపచ్చ రంగు వెలిగి సదరు సభ్యుల కేవైసీ పునరుద్ధరణ జరుగుతుంది. ఒకవేళ ఈ పాస్ మిషన్‌లో ఎరుపు రంగు వస్తే సదరు వినియోగదారుడి రేషన్ కార్డు, ఆధార్ సరిపోల్చలేమంటూ రిజెక్టు సూచిస్తుంది. దీంతో ఒక(సభ్యుడు) యూనిట్ రేషన్ కార్డు నుంచి తొలగింపునకు గురవుతారు.

రేషన్ కార్డులిలా..

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో వివిధ కేటగిరీల వారీగా 5,24,153 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిలో 17,20,035 మంది సభ్యులు(యూనిట్లు) ఉండగా, ప్రతినెలా 10,650.124 మెట్రిక్ టన్నుల బియ్యం రేషన్ షాపుల ద్వారా సరఫరా చేస్తున్నారు.

కార్డులో పేరుంటే కేవైసీ తప్పనిసరి

ప్రతి రేషన్ కార్డులోని సభ్యులంతా తమ వేలి ముద్రలు నమోదు చేసుకోవాలి. ఉపాధి, ఇతర పనుల నిమిత్తం వేరే ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారు తమ సమీపంలోని దుకాణానికి వెళ్లి ఈ-పాస్ మిషన్‌లో నమోదు చేసుకోవచ్చు. డీలర్లకు కూడా ఈ విషయంపై పూర్తి అవగాహన కల్పిస్తాం. ఈ ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత మార్పులు చేస్తారు. చౌక బియ్యం సరఫరా నిలిచిపోకుండా ఉండాలంటే అంతా ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలి.

- విజయలక్ష్మి, డీఎస్ఓ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

మండప నిర్వాహకులు ఈ సూచనలు పాటించాల్సిందే..

జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ పవన్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న పోలీసులు, హాజరైన నిర్వాహకులు

జీడిమెట్ల: గణేష్ నవరాత్రుల సందర్భంగా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకుని పండగను ప్రశాంతంగా జరుపుకోవాలని జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ పవన్ అన్నారు. బుధవారం షాపూర్‌నగర్‌లోని ఎంజే ఫంక్షన్‌హాల్‌లో గణేష్ మండప నిర్వాహకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో పోలీసులు మాట్లాడుతూ.. మండప నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

- గణేష్ మండప నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్, విద్యుత్ అధికారుల వద్ద అనుమతులు తీసుకోవాలి.
- రాత్రి 11గంటల తర్వాత మండపాల వద్ద మ్యూజిక్ సిస్టమ్‌లను ఆఫ్ చేయాలి.
- మండపం వద్ద తప్పనిసరిగా నిర్వాహకులు రాత్రిపూట విధిగా పడుకోవాలని.
- పోలీసులు మండపాల వద్దకు వచ్చినపుడు తప్పనిసరిగా నిర్వాహకులు అందుబాటులో ఉండాలి.
- జంతువులు మండపాల లోనికి రాకుండా బారీకేడ్లు ఏర్పాటు చేసుకోవాలి.
- అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలి.
- ఎలాంటి అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్త తీసుకోవాలి.
- మండపం వద్ద డ్రమ్ములో నీరు నిలువ ఉంచుకోవాలి.
- మండపాల వద్ద డీజేలకు అనుమతులు లేనందున డీజే ఏర్పాట్లు చేయవద్దు.
- సీసీ కెమరాలు ఏర్పాటు చేసుకోవాలి. పోలీసులకు సహకరించాలని కోరారు.

గణేశ్ చవితి ఉత్సవాలకు సమన్వయంతో పనిచేయాలి



వివిధ శాఖల అధికారులతో సమావేశమైన ఉప కమిషనర్లు నాగమణి, మల్లయ్య

కుత్బుల్లాపూర్: శాంతియుత వాతారణంలో గణేశ్ చవితి, నిమజ్జనాలు జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఉపకమిషనర్లు నాగమణి, మల్లయ్య అన్నారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో ఆయా విభాగాల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్లు మాట్లాడుతూ.. నిమజ్జనాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమజ్జనాలు జరిగే చెరువుల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జలమండలి జీఎం శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ రెహమాన్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ సాయిబాబా, ఎలక్ట్రికల్, లాఅండ్ఆర్డర్, ట్రాఫిక్, పారిశుద్ధ్య విభాగాల అధికారులు పాల్గొన్నారు.





కిషన్‌రెడ్డి చేపట్టిన దీక్షకు మద్దతు తెలిపేందుకు ర్యాలీగా వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్, నేతలు

బీజేపీ అధికారంలోకి రాగానే ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తాం

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తామని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు తూట్లు పొడుస్తున్న కేసీఆర్ సర్కారు విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు కిషన్‌రెడ్డి ఇందిరాపార్క్ వద్ద 24 గంటల ఉపవాస దీక్షను చేపట్టారు. బుధవారం శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున దీక్షస్థలికి తరలివెళ్లారు. గాజులరామారంలోని బీజేపీ అసెంబ్లీ కార్యాలయం నుంచి భారీ కార్ల ర్యాలీగా వెళ్లి కిషన్‌రెడ్డి చేపట్టిన దీక్షకు మద్దతు తెలిపారు.

- ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల కోసం 1200 మంది ఆత్మ బలిదానాలతో రాష్ట్రాన్ని సాధించుకుంటే బీఆర్ఎస్ సర్కారు తీరుతో యువతకు ఉద్యోగాలు రాలేదన్నారు. నోటిఫికేషన్లు ఇచ్చినట్టే ఇచ్చి పేపర్ లీకేజీలు చేసి యువతను నట్టేట ముంచిన ఘనత బీఆర్ఎస్ సర్కారుదేనని విమర్శించారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి ప్రత్యామ్నాయం బీజేపీయేనని అన్నారు.
- రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా తమ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి రాగానే యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, జిల్లా నాయకులు, గిరి వర్ధన్‌రెడ్డి, బక్క శంకర్‌రెడ్డి, జెకె శేఖర్ యాదవ్, నటరాజ్ గౌడ్, ఎమ్మెస్ వాసు, చండీ శ్రీనివాస్, పత్తి రఘుపతి, బావిగడ్డ రవి, శేఖర్, వెంకట్, మోతె శ్రీనివాస్‌యాదవ్, పున్నారెడ్డి, కంది శ్రీరాములు, రాజేశ్వరరావు, భానుచందర్ తదితరులు ఉన్నారు.

అవకతవకలు జరగనివ్వొద్దు

డీఈఓ విజయకుమారికి వినతి

సాక్షి, మేడ్చల్ జిల్లా: బదిలీలు, పదోన్నతుల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీయూటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి విఠల్ కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా విద్యాధికారి ఐ.విజయకుమారికి వారు వినతి పత్రం అందజేశారు. ఫ్రిఫరెన్షియల్ సర్టిఫికెట్లు సమర్పించిన వారిని జిల్లా వైద్యాధికారి సమక్షంలో మరోసారి పరీక్షించాలని సూచించారు. స్పౌజ్ పాయింట్లు ఉపయోగించిన ఉపాధ్యాయులు 2018 ట్రాన్స్‌ఫర్‌లో భర్త/భార్య ఉపయోగించుకున్నారో లేదో క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. స్పౌజ్ ఉపయోగించుకున్న వారు ఖచ్చితంగా స్పౌజ్ మండలంలోనే ఉండేలా చూడాలని కోరారు.

ఆహారంలో చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలి



తల్లులు, చిన్నారులతో ఐసీడీఎస్ అధికారులు

దుండిగల్: పౌష్టికాహారం తీసుకుంటే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని మహిళా శిశు సంక్షేమ శాఖ సీడీపీఓ ఉదయశ్రీ అన్నారు. జాతీయ పోషణ సంబరాల్లో భాగంగా దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్‌పల్లి శ్రీరాంనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉదయశ్రీ చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆహారంలో చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు క్రమం తప్పకుండా పౌష్టికాహార అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్పందన, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేశ్, అంగన్‌వాడీ టీచర్ ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే వివేకానంద్



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, మేయర్ నీలారెడ్డి

కుత్బుల్లాపూర్: తెలంగాణ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పని చేస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మేయర్ నీలారెడ్డితో కలిసి 19 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. గత ప్రభుత్వాల పాలనలో ఆడపిల్లల పెళ్లిళ్లు చేయాలంటే తల్లిదండ్రులకు తలకు మించిన భారంగా ఉండేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆడబిడ్డల పెళ్లిళ్లకు లక్ష నూట పదహారు రూపాయలు అందిస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

కమలమ్మకాలనీలో ప్రగతి యాత్ర

- గాజులరామారం డివిజన్ పరిధి కమలమ్మ కాలనీలో ఎమ్మెల్యే ప్రగతి యాత్ర చేపట్టి స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం ఎమ్మెల్యేకు మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందజేశారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రమణారెడ్డి, జనరల్ సెక్రటరీ సుబ్రమణ్యం, వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్, పాక్స్ డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులూ కస్తూరి బాలరాజ్, కమలాకర్, హుస్సేన్, సింగారం మల్లేష్, నవాబ్, ఇబ్రహీం ఖాన్, దూలప్ప, చెట్ల వెంకటేష్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

జగద్గిరిగుట్ట: విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు సబ్‌స్టేషన్ ఏఈఈ రాధాకిషన్ తెలిపారు. 11కేవీ జగద్గిరిగుట్ట, వెంకటేశ్వరనగర్ ఫీడర్ల పరిధిలోని జగద్గిరిగుట్ట, బీరప్ప నగర్, అంజయ్యనగర్ మైసమ్మనగర్, సోమయ్య నగర్, సంజయ్‌పూరికాలనీ, దేవమ్మబస్తీలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఓ ప్రకటనలో తెలిపారు.

సమస్యలను పరిష్కరించేందుకు అందుబాటులో ఉంటా

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



సమస్యలను వింటున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీలకు చెందిన ప్రజలను సమస్యలపై శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారి సమస్యలను విన్న శంభీపూర్‌రాజు సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడి తగు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్సీని కలిసి స్థానికంగా నెలకొన్న సమస్యలను నివేదించగా ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో క్రమశిక్షణ చర్యలు తప్పవని సున్నితంగా హెచ్చరించారు.

ఎస్సీ వర్గీకరణ విషయంలో నాన్చుడు ధోరణిని వీడాలి



వర్గీకరణ దీక్షకు సంఘీభావం తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్‌మాదిగ

రంగారెడ్డినగర్: కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ విషయంలో నాన్చుడు ధోరణిని వీడనాడి మాదిగలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్‌మాదిగ అన్నారు. కుత్బుల్లాపూర్ చౌరస్తాలో బుధవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎంఎస్‌ల ఆధ్వర్యంలో రిజర్వేషన్ల సాధనకు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నరేష్‌మాదిగ మాట్లాడుతూ.. ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఏ, బీ, సీ, డీలుగా ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలపాలన్నారు. అందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా నూతన అధ్యక్షుడ ప్రణయ్ కుమార్ మాదిగ, సీనియర్ నాయకులు సిలువేరు శ్రీనివాస్ మాదిగ, 57 మాదిగ ఉపకులాల రాష్ట్ర అధ్యక్షుడు రాజలింగం బుడగ, జంగాల మండల అధ్యక్షుడు యాదగిరి మాదిగ, సిద్దయ్య, రమేష్ మాదిగ, నర్సింహులు, జెస్సీ పాల్, భూమయ్య, జాన్, మహిళా నాయకురాలు జ్యోతి, సలోమి, శశికళ, సరూప, బాబు తదితరులు పాల్గొన్నారు.

'మా స్థలం కాజేసేందుకు యత్నిస్తున్నారు'

సుభాష్‌నగర్: అన్ని పత్రాలు ఉన్నా తమ భూమిలోకి ఇతర వ్యక్తులు దౌర్జన్యంగా వచ్చి స్థలం కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని స్థల యజమాని వరప్రసాద్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలోని సర్వే నం.158లో మర్రి మల్లారెడ్డి నుంచి ఒక ఎకరా 22 గుంటలు స్థలాన్ని గతంలో తాము కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇటీవల కలెక్టర్ నుంచి కూడా తమ పేర్లను ధరణిలో పొందుపరిచి కొత్త పాస్ పుస్తకాలు కూడా అందజేశారన్నారు. ఇంతలో మరో వ్యక్తి వచ్చి సదరు స్థలం తనదేనంటూ దౌర్జన్యానికి దిగుతున్నాడని ఈ విషయమై పేట్‌బషీరాబాద్ పోలీసులను ఆశ్రయించామని తెలిపారు. సదరు పోలీసులు తమకు న్యాయం చేయాల్సింది పోయి మంగళవారం పోలీసుల సహాయంతో అందులో ఉన్న సీసీ కెమెరాలను తీసుకెళ్లి పోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయమై ఉన్నతాధికారుల ఫిర్యాదు చేసినట్లు బాధితులు పేర్కొన్నారు.

'కమ్యూనిస్టులే నిజాం, దేశ్‌ముఖ్‌లను తరిమికొట్టారు'

- సాయుధ పోరాట వారోత్సవాల భారీ ర్యాలీ
- పెద్ద ఎత్తున్న పాల్గొన్న సీపీఐ, సీపీఎం నాయకులు



షాపూర్‌నగర్ నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్న కమ్యూనిస్టులు

జీడిమెట్ల: కమ్యూనిస్టులు ప్రాణాలకు తెగించి జరిపిన రైతాంగ సాయుధ పోరాటం ద్వారానే తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిందని సీపీఐ, సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శులు ఉమా మహేష్, కీలుకాని లక్ష్మణ్‌లు అన్నారు. కమ్యూనిస్టు పార్టీలు నిర్వహిస్తున్న తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా బుధవారం ఆయా పార్టీల నాయకులు షాపూర్‌నగర్‌లో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం షాపూర్‌నగర్ రైతుబజార్ బస్‌స్టాప్ వద్ద సమావేశం నిర్వహించారు.

- ఈ సందర్భంగా కమ్యూనిస్టు నాయకులు మాట్లాడుతూ... నిజాం నిరంకుశ, దేశ్‌ముఖ్‌ల పాలనలో తెలంగాణ ప్రజలు నలిగిపోతుంటే కమ్యూనిస్టు నాయకులు ప్రాణత్యాగాలు చేసి నిజాం, దేశ్‌ముఖ్‌లను తరిమికొట్టారన్నారు. రావినారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, భీమిరెడ్డి నరసింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, షేక్ బందగి ముగ్దుం, మోహినుద్దీన్‌ల త్యాగమే తెలంగాణ ప్రజలను కాపాడిందని గుర్తు చేశారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లు ఒక్కటై ప్రజలను మోసం చేస్తున్నాయి..

కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ రెపార్టీలు అమలుకాని హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అదానీలకు దోచి పెడుతుంటే.. రాష్ట్ర ప్రభుత్వం కేసీఆర్ కుటుంబ సభ్యులకు దోచిపెడుతోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజలు వాస్తవం తెలుసుకుని ఒకే ఒక్క ఓటుతో రెండు ప్రభుత్వాలను కుప్పకూల్చాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు స్వామి, సీఐటీయూ నాయకులు దేవదానం హరినాథ్, రాము, శ్రీనివాస్, బి.సత్యం, స్వాతి,కృష్ణ, బాషా, మల్లారెడ్డి, శ్రీనివాస్, మహేందర్, చంద్రకాంత్, రాములు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

10లక్షల ఎకరాల భూమిని పంచి పెట్టాం..

- అప్పట్లోనే దేశ్‌ముఖ్, దొరల చేతిలో ఉన్న 10లక్షల ఎకరాల భూమిని కమ్యూనిస్టు పార్టీ నాయకులు స్వాధీనం చేసుకుని ప్రజలకు పంచి పెట్టారని గుర్తు చేశారు. కేంద్రం నుంచి వచ్చిన పటేల్ సైన్యం నిజాం సైనికులను చంపినట్లుగా చరిత్రను తప్పుగా రాశారని కేంద్ర బలగాలు కమ్యూనిస్టు నాయకులనే పొట్టన పెట్టుకున్నాయని తెలిపారు. ఒకవేళ తెలంగాణ విముక్తి కోసం వచ్చిన సైన్యం వస్తే మరి కమ్యూనిస్టులను ఎందుకు జైల్లల్లో ఉంచి ఉరిశిక్షలు వేసి చంపారని ప్రశ్నించారు.

విన్నవించారు.. కోరిక తీర్చారు

పూల వ్యాపారులకు గద్దె నిర్మించిన కార్పొరేటర్



ఫుట్‌పాత్ పైనే వ్యాపారం (ఫైల్)



గద్దెను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జగన్, జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట బస్టాప్‌లో గత కొన్ని సంవత్సరాలుగా పూల వ్యాపారులు ఫుట్‌పాత్ పైనే దుకాణాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. రద్దీ దృష్ట్యా వీరి వ్యాపారం అంతంత మాత్రంగానే కొనసాగుతోంది. వాహనాలు ఆపి కొనక్కోవడానికి కూడా వీలు లేకుండా తీవ్రమైన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. పూల వ్యాపారులు ఇదే బస్టాప్ వెనకాల ఉన్న స్థలంలో కూర్చొని వ్యాపారం చేసుకొనేలా గద్దె, షెడ్డు నిర్మాణం చేపట్టాలని కార్పొరేటర్‌ను కోరారు. దీనికి స్పందించిన ఆయన వాటి నిర్మాణం చేపట్టారు. పనులు పూర్తవడంతో బుధవారం కార్పొరేటర్ జగన్, జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్‌తో కలిసి గద్దెను ప్రారంభించారు. ఇప్పుడు పూల వ్యాపారులు ఎలాంటి ఆటంకం లేకుండా వ్యాపారం చేసుకోవచ్చని కార్పొరేటర్ అన్నారు. ఈ కార్యక్రమంలో దత్తాత్రేయ, మల్లేష్‌గౌడ్, పాపుల్‌గౌడ్, బాబుగౌడ్, సురేష్, గణేష్ పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029